నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చార్మినార్: చెట్ల కొమ్మల తొలగింపు కారణంగా చార్మినార్‌లోని పలు ప్రాంతాల్లో మంగళవారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని టీజీఎస్‌పీడీసీఎల్ చార్మినార్ సీబీడీ ఏడీఈ ఓ ప్రకటనలో తెలిపారు. బండ్లగూడ, ఈద్గా, వీకర్ సెక్షన్ కాలనీ, ఎస్ఎం గూడా యూజీసీ తదితర విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సిద్దిక్ గుల్షన్, మురళీనగర్, పాండురంగా నగర్, హుడా కాలనీ తదితర విద్యుత్ ఫీడర్ పరిధిలోని పలు ప్రాంతాల్లో మధ్యాహ్నం 2.30 నుంచి సాయంత్రం 5.30 గంటల వరకు అంతరాయం కలుగుతుందన్నారు.

ఆగాపురా ఫీడర్ పరిధిలో..

అఫ్జల్‌గంజ్: 11 కేవీ ఆగాపురా, హిందీనగర్, ఆసిఫ్‌నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆగాపురా, నమాజ్ గ్రౌండ్, హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్, చాక్నావాడి, రజాక్‌పురా, భారత్ మెటల్ వర్క్స్ లేన్, ద్రౌపతి గార్డెన్, ఫ్రెండ్స్ కేఫ్, మాంగార్ బస్తీ తదితర ప్రాంతాల్లో బుధవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు అంతరాయం ఉంటుందన్నారు. అలాగే అంబేడ్కర్ నగర్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని అమ్లాపూర్, అశోక్ విహార్, జాఫర్ గూడ, చర్చ్ పీటీ, యూసుఫ్‌నగర్, ఫైయ్‌చమన్ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి సాయంత్రం 5 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

పేకాట స్థావరంపై దాడి

సంతోష్‌నగర్: పేకాట స్థావరంపై దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు మంగళవారం దాడులు నిర్వహించి ఎనిమిది మందిని అరెస్ట్ చేసిన ఘటన కంచన్‌బాగ్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం..హఫీజ్‌బాబానగర్ సీ–బ్లాక్ ప్రాంతంలోని ఓ ఇంట్లో గుట్టుచప్పుడు కాకుండా పేకాట ఆడుతున్నారు. విశ్వసనీయమైన సమాచారం అందుకున్న దక్షిణ మండలం టాస్క్‌ఫోర్స్ పోలీసులు పేకాట స్థావరంపై మంగళవారం దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో ఎనిమిది మందిని అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి ఏడు సెల్‌ఫోన్లు, రూ.20 వేల నగదును స్వాధీనం చేసుకొని తదుపరి విచారణ నిమిత్తం కంచన్‌బాగ్ పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ఢిల్లీ బోనాల ఉత్సవాలకు ఏర్పాట్లు చేయాలి



మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాన్ని అందజేస్తున్న మారుతీ యాదవ్

చాంద్రాయణగుట్ట: ఢిల్లీలో నిర్వహించే లాల్‌దర్వాజా సింహవాహిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలకు రాష్ట్ర ప్రభుత్వం తరఫున అన్ని ఏర్పాట్లు చేయాలని కమిటీ చైర్మన్ బి.మారుతీ యాదవ్ కోరారు. ఈ మేరకు మాజీ చైర్మన్ కె.వెంకటేష్, కోశాధికారి ఎ.చంద్రకుమార్‌తో కలిసి దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖకు వినతిపత్రాన్ని అందజేశారు. తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను ఢిల్లీలో తెలిపే ఉద్దేశంతో ఈ నెల 30 నుంచి మూడు రోజుల పాటు బోనాల ఉత్సవాలు నిర్వహిస్తామన్నారు.


లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోండి



మాట్లాడుతున్న రంగారెడ్డి కోర్టు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కర్ణ కుమార్

సిటీ కోర్టులు: జాతీయ లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని రంగారెడ్డి కోర్టు ప్రిన్సిపల్ జిల్లా జడ్జి కర్ణ కుమార్ తెలిపారు. మంగళవారం రంగారెడ్డి జిల్లా కోర్టులోని జిల్లా న్యాయ సేవాధికార సంస్థలో కార్యదర్శి శ్రీవాణి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి జడ్జి కర్ణకుమార్ ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. జాతీయ న్యాయ సేవాధికార సంస్థ, న్యూ ఢిల్లీ, తెలంగాణ న్యాయ సేవాధికార సంస్థ, హైదరాబాద్ వారి ఆదేశాల మేరకు జూన్ 14న జాతీయ మెగా లోక్ అదాలత్ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. లోక్ అదాలత్ ద్వారా ఇప్పటి వరకు కోర్టు ముందుకు రాని కేసులు, పెండింగ్ కేసులను పరిష్కరించుకునేందుకు ఇది మంచి అవకాశమని, కక్షిదారులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని తెలిపారు.

నాలాల పూడికతీత పనులు చేపట్టండి



మాట్లాడుతున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: వర్షాకాలం ప్రారంభమైనప్పటికీ నేటికీ నాలాలు, కచ్చా మోరీల పూడికతీత పనులు చేపట్టకపోవడం జీహెచ్ఎంసీ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శమని గోషామహల్ బీఆర్ఎస్ నాయకులు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. స్థానిక ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులతో పాటు ఎమ్మెల్యే రాజాసింగ్ పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. మంగళవారం గౌలిగూడలోని తన కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ..స్థానిక ప్రజా సమస్యలపై ఎమ్మెల్యే రాజాసింగ్ సంబంధిత అధికారులతో ఏనాడూ సమీక్ష సమావేశాలు నిర్వహించలేదని విమర్శించారు. వర్షాకాలం ప్రారంభమై పది రోజులు గడిచినా నేటికీ గోషామహల్ నియోజకవర్గంలో నాలాలు, కచ్చా మోరీల పూడికతీత పనులు చేపట్టకుండా అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారన్నారు. ఇప్పటికైనా ఎమ్మెల్యే మేల్కొని ప్రజలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

దడ పుట్టిస్తున్న విద్యుత్ వైర్లు

- శిథిలావస్థలో వీధి దీపాల వైర్లు
- లోపించిన నిరంతర పర్యవేక్షణ
- భయాందోళనలో స్థానికులు



గౌలిపురాలో అడ్డదిడ్డంగా విద్యుత్ వైర్లు



మామాజుమ్లా పాటక్‌లో కాలిపోయిన విద్యుత్ వైర్లు (ఫైల్)

చార్మినార్: పాతబస్తీలో శిథిలావస్థకు చేరిన వీధి దీపాల వైర్లు స్థానికులకు ప్రమాదకరంగా మారాయి. దీనికి తోడు సర్వీస్ వైర్లు నాణ్యతా లోపంతో ఉండడంతో అప్పుడప్పుడు అగ్ని ప్రమాదాలు సైతం చోటు చేసుకుంటున్నాయి. నిరంతరం పర్యవేక్షించాల్సిన ఉన్నతాధికారులు తమ సీట్లకే పరిమితం కావడంతో ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. జోరుగా వీస్తున్న ఈదురు, గాలులతో పాటు వర్షాలు కురుస్తున్నప్పుడు ప్రమాదవశాత్తు ఈ వీధి స్తంభాల విద్యుత్ వైర్లు తెగి కిందపడుతున్నాయి. దీంతో స్థానికులకు ప్రమాదాలకు గురవుతున్నారు.

క్షేత్రస్థాయి పరిశీలన అవసరం

టీజీఎస్‌పీడీసీఎల్ దక్షిణ మండలం కార్యాలయం పరిధిలో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్, బేగంబజార్ తదితర కీలక డీఈ కార్యాలయాలున్నాయి. ఇందులో చార్మినార్, ఆస్మాన్‌ఘడ్ డివిజన్ల పరిధిలోని ఏడీఈ, ఏఈ కార్యాలయాలు పాతబస్తీ పరిధిలోకి వస్తాయి. ఒక్కో డీఈ కార్యాలయం పరిధిలో డీఈతో పాటు ఏడీఈలు, ఏఈలు, ఇతర కింది స్థాయి సిబ్బంది విధి నిర్వహణలో ఉంటారు. అధికారులు, సిబ్బంది తగినంత ఉన్నప్పటికీ పాత బస్తీలోని పలు ప్రాంతాల్లో అప్పుడప్పుడు విద్యుత్ సమస్యలు తలెత్తుతునే ఉన్నాయి. టీజీఎస్‌పీడీసీఎల్‌లోని డీఈ, ఏడీఈ స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు కిందిస్థాయి సిబ్బందిని విధి నిర్వహణపై అప్రమత్తం చేస్తూ క్షేత్ర స్థాయి పరిశీలన చేయాల్సిన అవసరముందని ప్రజలు అంటున్నారు.

ఏబీ కేబుల్ లైన్ ఏర్పాటు చేయాలి

పాతబస్తీలోని పలు ప్రాంతాల్లో ఏబీ (ఎయిర్ బంచ్) కేబుల్‌ను ఏర్పాటు చేయాలని ఎన్నో ఏళ్లుగా సంబంధిత విద్యుత్ అధికారులను ఆయా ప్రాంతాల ప్రజలు కోరుతున్నారు. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లు శిథిలావస్థకు చేరుకొని ప్రమాదాలకు కారణమవుతున్నాయంటున్నారు. శిథిలావస్థకు చేరిన విద్యుత్ వైర్లు గృహాలకు అతి సమీపంలో ఉండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయంటున్నారు. గతంలో మామాజుమ్లా పాటక్ వద్ద జరిగిన ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులు తీవ్ర గాయాలకు గురయ్యారన్నారు. సంబంధిత విద్యుత్ అధికారులు వెంటనే క్షేత్రస్థాయి పరిశీలన చేసి అవసరమైన చోట ఏబీ కేబుల్ విద్యుత్ వైర్లను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. కొన్ని ప్రాంతాల్లో వీధి స్తంభానికి కుప్పలు తెప్పలుగా విద్యుత్ వైర్లుండి స్థానికులను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. సర్వీస్ వైర్ల క్వాలిటీని అప్పుడప్పుడు పరిశీలించి అవసరమైన మేరకు చర్యలు తీసుకోవాలని స్థానికులు అంటున్నారు.

అడ్డదిడ్డంగా ఉన్న వైర్లను మార్చాలి



వీధి స్తంభాలకు విద్యుత్ వైర్లు అడ్డదిడ్డంగా ఉన్నాయి. సాలె గూడు లాంటి విద్యుత్ వైర్లు భయాందోళన గురి చేస్తున్నాయి. ఒక్కోసారి ఆయా ప్రాంతాల నుంచి వెళ్లాలంటే దడ పుడుతోంది. ఎన్నో ఏళ్ల క్రితం ఏర్పాటు చేసిన విద్యుత్ వైర్లను ఎప్పటికప్పుడు పరిశీలించి కొత్తగా విద్యుత్ వైర్లను ఏర్పాటు చేస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి.

– గణేష్, వ్యాపారి

ఏబీ కేబుల్ వైర్లను ఏర్పాటు చేయాలి



ఇళ్ల సమీపం నుంచి వెళుతున్న విద్యుత్ వైర్లను వెంటనే మార్చాల్సిన అవసరం ఉంది. ఏబీ కేబుల్ వైర్లను అందుబాటులోకి తెస్తే ప్రమాదాలు జరగకుండా ఉంటాయి. గతంలోనే ఏబీ కేబుల్ వైర్లను ఏర్పాటు చేస్తామని సంబంధిత విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు చెప్పినప్పటికీ ఆచరణలో పెట్టడం లేదు. దీంతో విద్యుత్ ప్రమాదాలు సంభవిస్తున్నాయి.

– మహ్మద్ సర్దార్, ప్రైవేటు ఉద్యోగి

టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా అల్లం భాస్కర్



మహేశ్‌కుమార్ గౌడ్‌ను సన్మానిస్తున్న అల్లం భాస్కర్

గౌలిపురా: టీపీసీసీ ప్రధాన కార్యదర్శిగా పాతబస్తీ గౌలిపురా ప్రాంతానికి చెందిన అల్లం భాస్కర్ నియమితులయ్యారు. ఈ సందర్భంగా అల్లం భాస్కర్ మాట్లాడుతూ..తనపై ఎంతో నమ్మకంతో పార్టీ అధిష్ఠానం తన పదవీ అప్పగించడంతో తనపై మరింత బాధ్యత పెరిగిందన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేస్తున్న ప్రతి కార్యకర్తకు కాలానుగుణంగా తగిన గుర్తింపు లభిస్తుందనడానికి తానే నిదర్శనమన్నారు. కాంగ్రెస్ పార్టీలో పని చేసే ప్రతి కార్యకర్తకు ఎల్లప్పుడు గుర్తింపు ఉంటుందని..పార్టీ అండగా ఉంటుందన్నారు. తనకు పార్టీ పదవీ అప్పగించినందుకు మంగళవారం టీపీసీసీ అధ్యక్షుడు బొమ్మ మహేశ్ కుమార్ గౌడ్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో ఘనంగా సత్కరించారు. తనపై ఈ పదవీ బాధ్యతలను అప్పగించినందుకు పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే, ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

పురుషోత్తం, మహమూద్‌కు అవార్డుల ప్రదానం



పురుషోత్తం, మహమూద్‌కు అవార్డును అందజేస్తున్న దృశ్యం

అబిడ్స్: ప్రపంచంలో శాంతి, అభివృద్ధి, సమానత్వాన్ని తీసుకురావడంలో ఉన్నత విద్యా ప్రాముఖ్యతను ఎంతో ఉందని తెలంగాణ కౌన్సిల్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ వైస్ చైర్మన్–ఐ ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం అన్నారు. తెలంగాణ మేధావుల ఫోరం, తెలంగాణ ఇంట్రడక్షన్ ఫోరం శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జాతీయ ఉన్నత విద్యా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రొఫెసర్ ఇటికల పురుషోత్తం, ప్రొఫెసర్ ఎస్‌కే.మహమూద్‌లకు జెమ్ ఆఫ్ హయ్యర్ ఎడ్యుకేషన్ అవార్డు 2025 ప్రదానం చేశారు. పురుషోత్తం మాట్లాడుతూ..2020–2021లో వెలువడిన ఒక రిపోర్ట్ ప్రకారం మన దేశంలో 18–23 ఏళ్లలోపు వయస్సు వారిలో 28.4 శాతం మంది ఉన్నత విద్యను అభ్యసిస్తున్నారన్నారు. ఉన్నత విద్యామండలి చైర్మన్–ఐఐ ప్రొఫెసర్ ఎస్.కే.మహమూద్ మాట్లాడుతూ..మౌలానా అబ్దుల్ కలాం ఆజాద్ దూరదృష్టి కారణంగానే దేశంలో ఐఐటీ యూనివర్శిటీ గ్రాండ్ కమిషన్, విశ్వవిద్యాలయాలు, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఏర్పాటు ఉన్నత విద్యకు అత్యున్నత మార్గం ఏర్పడిందన్నారు. అమెరికా దేశ పర్యటనలో ఉన్నత తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ రాజ్‌నారాయణ ముదిరాజ్ ఈ సందర్భంగా పురుషోత్తమ్, ఎస్.కె. మహమూద్‌లకు శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ మేధావుల ఫోరం రాష్ట్ర కార్యదర్శి మహ్మద్ అక్తర్ అలీ, ఉస్మానియా యూనివర్సిటీ ఎన్ఎస్ఎస్ ట్రైనర్ డాక్టర్ రవితేజ చౌహాన్, మహ్మద్ సలీం, ఫాతీమా, కావముని శ్యామ్‌రావు ముదిరాజ్, జి.వేణుగోపాల్, సూర్య, గన్‌శ్యామ్ పాల్గొన్నారు.

బోనాలకు ముందే అభివృద్ధి పనులు పూర్తి చేయాలి



మంత్రి కొండా సురేఖకు పరిస్థితిని వివరిస్తున్న పులిపాటి రాజేశ్ కుమార్

చార్మినార్: పాతబస్తీలోని అన్ని ఆలయాల వద్ద అవసరమైన మేరకు వెంటనే అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టాలని బహదూర్‌పురా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పులిపాటి రాజేశ్ కుమార్ మంత్రి కొండా సురేఖను కోరారు. ఆమెను కలిసి వినతిపత్రం అందజేసినట్లు తెలిపారు. ఆషాఢ మాసం బోనాల జాతర ఉత్సవాలను వైభవంగా నిర్వహించడానికి ప్రభుత్వం నుంచి అన్ని ఏర్పాట్లు చేయాలని కోరామన్నారు. బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులను పూర్తి చేయాలన్నారు. పాతబస్తీలోని అన్ని చిన్న ఆలయాల నిర్వాహకులకు దేవాదాయ శాఖ తరఫున అవసరమైన మేరకు ఆర్థిక సాయం అందించాలని మంత్రిని కోరినట్లు రాజేశ్ కుమార్ తెలిపారు.

బీఎస్పీని బలోపేతం చేయాలి

నాంపల్లి: బీఎస్పీని బలోపేతం చేయడానికి స్థానిక నేతలు జిల్లాలో క్షేత్రస్థాయి పర్యటనలు చేపట్టాలని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇబ్రహీం శేఖర్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం హైదరాబాద్ ఇన్‌చార్జి అలగోల రమేష్ అధ్యక్షతన జిల్లా స్థాయి సమీక్షా సమావేశం జరిగింది. ముఖ్యఅతిథిగా ఇబ్రహీం శేఖర్ హాజరై ప్రసంగించారు. జిల్లా స్థాయిలో చేపట్టాల్సిన కార్యక్రమాలపై ఆయన నేతలకు దిశానిర్దేశం చేశారు. రానున్న స్థానిక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నిక వంటి అంశాలపైన చర్చించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు వైవి.గిరి మారాజు, ఉపాధ్యక్షులు మనీబాబు, ప్రధాన కార్యదర్శి అదారి రాజేష్, కోశాధికారి లక్ష్మణ్, గోషామహల్ నియోజకవర్గం అధ్యక్షులు కల్యాణి నందేష్‌కుమార్, యాకుత్‌పురా అధ్యక్షుడు రవికృష్ణ తదితరులు పాల్గొన్నారు.



పెంచిన బస్‌పాస్ చార్జీలను తగ్గించండి

గౌలిపురా: తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ సర్కార్ ఎన్నికల ముందు మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం హామీ ఇచ్చి ఈ హామీతో ఏర్పడుతున్న లోటును భర్తీ చేసేందుకు బస్సు పాస్ చార్జీలను పెంచడం సరైంది కాదని సీపీఐ హైదరాబాద్ జిల్లా కార్యవర్గ సభ్యుడు గడ్డమీది చంద్రమోహన్ ఆరోపించారు. ఛార్జీలను పెంచడంతో పేద, మధ్య తరగతి ప్రయాణికులకు భారమని.. పెంచిన చార్జీలను పునరాలోచన చేసి విరమించుకోవాలని డిమాండ్ చేశారు. ఎన్నికల్లో నేరవేర్చ సాధ్యం కాని హామీలను ఇచ్చి అవి అమలు చేయడానికి ఏదో ఒక రూపంలో ధరలను పెంచి పేద, మధ్య తరగతి ప్రజల మీద భారం మోపడం శోచనీయమన్నారు.

టీపీసీసీ ఉపాధ్యక్షుడిగా అప్సర్ యూసుఫ్ జాహి



గోల్కొండ: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షుడిగా గోల్కొండకు చెందిన సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అప్సర్ యూసుఫ్ జాహి నియమితులయ్యారు. ఈ మేరకు ఏఐసీసీ నుంచి ఆయనకు నియామక ఉత్తర్వులు అందాయి. మూడు దశాబ్దాలుగా కాంగ్రెస్‌లోని వివిధ విభాగాల్లో క్రియాశీలకంగా ఆయన వ్యవహరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కాంగ్రెస్ పార్టీలో పని చేసే వారికి ప్రాధాన్యం ఉంటుందని మరోసారి రుజువైందన్నారు. తనపై నమ్మకం ఉంచిన సోనియాగాంధీ, రాహుల్ గాంధీ, ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున్ ఖార్గే, టీపీసీసీ అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్‌కు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ నూతన కార్యవర్గం

చార్మినార్: ఈసారి ఆషాఢ మాసం బోనాలను వైభవంగా నిర్వహించడానికి తగిన ఏర్పాట్లు చేస్తున్నామని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. ఆలయం కమిటీ నూతన కార్యవర్గాన్ని ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. ఆలయ కమిటీ ఉపాధ్యక్షుడిగా జి.అనంతయ్య, జి.బుగ్గయ్య, శృంగారం ఆత్రేయాచార్యులు, చలువాది విజయానంద్‌రవు, ప్రధాన కార్యదర్శిగా కాట కృష్ణ, కార్యనిర్వాహక కార్యదర్శిగా కాట రమేష్, కోశాధికారిగా ఎ.రమేష్, సంయుక్త కోశాధికారిగా జి.రాహుల్, కార్యదర్శులుగా సుందర్ అగర్వాల్, ఎం.శంకర్, బి.పవన్‌కుమార్, డి.సాయిలు, కాట ప్రకాష్, సీహెచ్. కిషోర్‌కుమార్, సంయుక్త కార్యదర్శులుగా జంగయ్య, వెంకటేష్, మహేష్ గుప్తా, సాయినాథ్, వినోద్‌కుమార్ జైన్, ప్రచార కార్యదర్శులుగా సీహెచ్. శ్రీకాంత్, బి.లకన్ కుమార్, ఏ.ధన్‌రాజ్, శ్రీనివాస్, నరేష్‌తో పాటు శివకుమార్, ఆదిత్య, తాండవ కృష్ణ తదితరులు నియమితులైనట్లు గాజుల అంజయ్య తెలిపారు.

ముంపు సమస్యను పరిష్కరించాలి



జడ్‌సీ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తున్న జేఏసీ నాయకులు

చాంద్రాయణగుట్ట: డివిజన్‌లోని పలు బస్తీల్లో దశాబ్దాలుగా నెలకొన్న ముంపు సమస్యను వెంటనే పరిష్కరించాలని గౌలిపురా వర్షపు నీటి జేఏసీ నాయకులు డిమాండ్ చేశారు. సమస్యకు శాశ్వత పరిష్కారం చేయాలని కోరుతూ మంగళవారం చాంద్రాయణగుట్టలోని జీహెచ్ఎంసీ చార్మినార్ జోన్ జోనల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ..డివిజన్‌లోని హనుమాన్‌నగర్ ఫేజ్–1,2, అచ్చయ్యనగర్, అంబికానగర్, అయోధ్యనగర్, పటేల్‌నగర్, శ్రీరామ్ నగర్ కాలనీల్లో వర్షాకాలం వచ్చిందంటే ప్రజలు ఇళ్లల్లో ఉండలేని పరిస్థితి నెలకొంటుందన్నారు. ఈ విషయమై ఎన్నిసార్లు విన్నవించినా ఫలితం లేకుండా పోతుందన్నారు. అనంతరం సర్కిల్–7 డిప్యూటీ కమిషనర్ మంగతాయార్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు ఆశిష్ గోపి, జి.చంద్రమోహన్ గౌడ్, నర్సింహా గౌడ్, శివ చంద్రగిరి, శ్రీరాములు, దేవేందర్, నళిని, సాయి, నరహరి, రాకేష్, రాజు పాల్గొన్నారు.

పాతబస్తీలో బీఆర్ఎస్‌ను మరింత బలోపేతం చేయాలి



కేటీఆర్‌ను కలిసిన మహ్మద్ సలావుద్దీన్ లోధీ

చార్మినార్: పాతబస్తీలో బీఆర్ఎస్ పార్టీని మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలని బీఆర్ఎస్ చార్మినార్ నియోజకవర్గం ఇన్‌చార్జి మహ్మద్ సలావుద్దీన్ లోధీ అన్నారు. ఈ మేరకు బీఆర్ఎస్ యువజన నాయకుడు మహ్మద్ సైఫుద్దీన్‌తో కలిసి సోమవారం వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్‌ను కలిసి పార్టీ అభివృద్ధికి తీసుకోవాల్సిన అంశాలను చర్చించినట్లు ఆయన తెలిపారు. గత ఏడాదిన్నరగా కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీ వ్యతిరేక విధానాలకు పాల్పడుతోందన్నారు. తమ ప్రభుత్వ హయాంలో ముస్లిం నాయకులకు సముచితమైన స్థానం లభించడంతో పాటు ముస్లింల సంక్షేమాన్ని నిరంతరం కొనసాగించామన్నారు.

ఇందిరమ్మ రాజ్యంలోనే అన్ని వర్గాల సంక్షేమం

అబిడ్స్: ఇందిరమ్మ రాజ్యంలోనే అన్నివర్గాల సంక్షేమం కొనసాగుతుందని ఖైరతాబాద్ జిల్లా కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు ఎస్.ధన్‌రాజ్ పేర్కొన్నారు. టీపీసీసీ నూతన ఉపాధ్యక్షుడిగా నియమితులైన మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను ఆయన మంగళవారం ఘనంగా సత్కరించి అభినందించారు. ఈ సందర్భంగా ధన్‌రాజ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ప్రజల సంక్షేమం, అభివృద్ధి కొనసాగుతుందన్నారు. గోషామహల్ నియోజకవర్గంలో ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకువస్తే అన్ని శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తామని హామీ ఇచ్చారు.



మాజీ మేయర్ బొంతు రామ్మోహన్‌ను సత్కరిస్తున్న ధన్‌రాజ్

కోట బోనాలను ఘనంగా నిర్వహిస్తాం



కొండా సురేఖకు ఆహ్వానపత్రం, జ్ఞాపికను అందజేస్తున్న సాయిబాబాచారి

గోల్కొండ: గోల్కొండ కోట బోనాలను ఘనంగా నిర్వహిస్తామని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి అమ్మవారి ఆషాఢ బోనాల జాతర మొదటి జూలూస్‌కు సంబంధించిన ఆహ్వానపత్రాన్ని వృత్తిపని వారి సంఘం మాజీ అధ్యక్షుడు బి.సాయిబాబాచారి మంగళవారం ఆమెకు అందజేశారు. ఆహ్వానపత్రంతో పాటు ఆయన అమ్మవారి జ్ఞాపికను కూడా మంత్రికి బహూకరించారు. ఈ సందర్భంగా మంత్రి కొండా సురేఖ మాట్లాడుతూ..కోట బోనాలు ప్రజల అచంచల భక్తికి నిదర్శనమన్నారు. ఆమెను కలిసిన వారిలో ఆలయ పూజారి బి.సురేష్‌చారి, విజయ్‌కుమార్, వినోద్ కుమార్, యాదగిరిచారి తదితరులున్నారు.

పాలాభిషేకం



సీఎం రేవంత్‌రెడ్డి, మంత్రి కొండా సురేఖ చిత్రపటాలకు పాలాభిషేకం చేస్తున్న అర్చక జేఏసీ నాయకులు

సుల్తాన్‌బజార్: తెలంగాణ అర్చకుల సంక్షేమంలో కాంగ్రెస్ ప్రభుత్వం చరిత్రాత్మక అడుగు వేసిందని తెలంగాణ అర్చక ఉద్యోగుల జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్ర శర్మ, అధ్యక్షుడు కాండూరి కృష్ణమాచార్యులు అన్నారు. దూపదీప నైవేద్య అర్చకుల సంక్షేమానికి నిరంతరం కృషిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి, దేవాదాయ శాఖ మంత్రి కొండ సురేఖ చిత్రపటాలకు జేఏసీ ఆధ్వర్యంలో మంగళవారం పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో దూపదీప నైవేద్యాల అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌల్తాబాద్ వాసుదేవ శర్మ, మఠైకా ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు మారుతి సత్యనారాయణ శర్మ, శరత్‌కుమార్, గంట నారాయణ స్వామి, రామలింగేశ్వర శర్మ, రవీంద్రచార్యులు, చంద్రశేఖర శర్మ పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



చెక్కులను అందజేస్తున్న కార్పొరేటర్ రాకేష్‌జైస్వాల్

సుల్తాన్‌బజార్: సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ సూచించారు. మంగళవారం నాంపల్లి డిప్యూటీ తహసీల్దార్ వెంకటేశ్వర్‌రావుతో కలిసి కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..జాంబాగ్ డివిజన్‌లో ప్రజలు షాదీ ముబారక్ లాంటి పథకాలలో ఏవైనా ఇబ్బందులు కలిగితే తమను సంప్రదించాలని కోరారు. అంతేకాకుండా రేషన్‌కార్డులు, రాజీవ్ యువ వికాసం లాంటి పథకాల్లో ప్రజలకు ఇబ్బందులు కలుగకుండా అధికారులతో సమన్వయం చేసుకుంటూ ముందుకు సాగుతున్నామన్నారు.

చారిత్రక ప్రదేశాలను పరిరక్షించాలి

గోల్కొండ: గోల్కొండ కోట ప్రహరీలను ఆనుకొని ఉన్న ఖాళీ స్థలాలు కబ్జాకు గురి కాకుండా చర్యలు తీసుకోవాలని కాంగ్రెస్ ఇన్‌చార్జి ఉస్మాన్ బిన్ మహ్మద్ అల్ హాజరీ అన్నారు. ఈ మేరకు మంగళవారం ఆయన కేంద్ర పురాతత్వ సర్వేక్షణ శాఖ హైదరాబాద్ సర్కిల్ సూపరింటెండెంట్ నిఖిల్ దాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. కోట కందకాలు, కోట ప్రహరీలను ఆనుకొని ఉన్న ప్రదేశాలను కబ్జా చేసి కొందరు అమ్ముకుంటున్నారని వినతిపత్రంలో పేర్కొన్నారు. ఆయనను కలిసిన వారిలో సీపీఎం హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి జి.విఠల్, రషీద్, మొయిన్, ఏజాజ్, సర్వర్ తదితరులున్నారు.



నిఖిల్ దాస్‌కు వినతిపత్రం అందజేస్తున్న ఉస్మాన్ హాజరీ

ప్రజా సమస్యలపై అధికారులు స్పందించాలి



వివిధ శాఖల అధికారులతో సమావేశమైన ఎమ్మెల్యే

గోల్కొండ: ప్రజా సమస్యలపై అధికారులు వెంటనే స్పందించాలని ఎమ్మెల్యే కౌసర్ మోహియుద్దీన్ అన్నారు. మంగళవారం నానల్‌నగర్ డివిజన్‌లోని తన కార్యాలయంలో జలమండలి, బల్దియా అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..తాగునీటి సరఫరాపై తనకు ప్రతినిత్యం ఎన్నో ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. లోతట్టు ప్రాంతాల ప్రజలు సరిపడ తాగునీరు అందక ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఈ విషయంపై తాను క్షేత్రస్థాయి అధికారులకు తెలిపినా వారు స్పందించడం లేదన్నారు. అధికారులు క్షేత్రస్థాయిలో పర్యటించి సాంకేతికంగా తలెత్తుతున్న సమస్యలు గుర్తించి వాటిని వెంటనే పరిష్కరించాలని సూచించారు. టూంబ్స్ రోడ్డు, టోలిచౌకీ అక్బర్‌పురా, ఎండిలైన్స్ రోడ్డు, గోల్కొండ, మోతీదర్వాజా, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో అభివృద్ధి పనుల నిమిత్తం రోడ్లను తవ్వారన్నారు. అయితే ఈ తవ్వకాల సందర్భంగా తాగునీటి పైపులు పలు చోట్ల దెబ్బతిన్నాయని ఈ కారణంగా ఆ ప్రాంతాల్లో నల్లాలో తక్కువ నీరు వస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో నానల్‌నగర్ కార్పొరేటర్ మహ్మద్ నసీరుద్దీన్, హారూన్‌ఫరాన్ తదితరులున్నారు.